నేడు జాబ్ మేళా

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై ఉన్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో శనివారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న గిరిజన సంక్షేమ అధికారి వెంకటేష్

సుభాష్‌నగర్: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సంగారెడ్డి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన కుత్బుల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు పొలిటికల్ సైన్స్ మెటీరియల్ ఉచితంగా అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ నాగేందర్, అధ్యాపకులు ఉపేందర్, మనోహర్, అజిత్, సాయి కృష్ణ, విజయ లలిత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఏసీపీ నరేష్, సిబ్బంది

రంగారెడ్డినగర్: వాహనదారులు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని ఏసీపీ నరేష్ అన్నారు. జీడిమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులను గుర్తించి వారికి జరిమానా విధించామని తెలిపారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జీడిమెట్ల సీఐ మల్లేష్, సిబ్బంది పాల్గొన్నారు.


క్షతగాత్రుడికి సీపీఆర్ చేసి కాపాడిన 108 సిబ్బంది



కుత్బుల్లాపూర్: 108 సిబ్బంది సీపీఆర్ చేసి ఓ క్షతగాత్రుడి ప్రాణాలు కాపాడాడు. కొంపల్లి నుంచి సుచిత్ర వెళ్లే రోడ్డులోని రాయి చాందిని మాల్ ఎదురుగా ఉన్న ప్రధాన రోడ్డులో శుక్రవారం కర్ణాటకకు చెందిన అంబదాస్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో అతను అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు 108కి సమాచారమిచ్చారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పైలెట్ నవీన్, ఈఎంటీ పోశెట్టి క్షతగాత్రుడికి సీపీఆర్ చేయడంతో పల్స్ తిరిగి ప్రారంభమయ్యాయి. అనంతరం సీఎంఆర్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుడి ప్రాణాలు కాపాడిన పైలెట్, ఈఎంటీలను స్థానికులు అభినందించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. పట్టించుకోని అధికారులు


చింతల్: ఒకే రోడ్డులో ఒకటి కాదు.. రెండు కాదు.. మూడు విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఒరిగినా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరిగినపుడు చూద్దాములే అన్నట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చింతల్ కాలనీలోని ప్రధాన రోడ్డులో మూడు చోట్ల విద్యుత్ స్థంభాలు ఓ పక్కకు ఒరిగాయి. ఈ విషయమై స్థానికులు పలుసార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా? అన్ని చింతల్ కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



చింతల్ కాలనీ రోడ్డులో ఒరిగిన విద్యుత్ స్తంభం

నేరాల నియంత్రణే లక్ష్యం

- ముమ్మరంగా వాహనాల తనిఖీలు
- డ్రగ్స్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చొరవ
- పట్టుబడ్డ వారికి కుటుంబ సభ్యులతో కలిసి కౌన్సెలింగ్





వాహనాల తనిఖీలో డీసీపీ కోటిరెడ్డి తదితరులు

జీడిమెట్ల/జగద్గిరిగుట్ట: రోజురోజుకు పెరుగుతున్న నేర ప్రవృత్తిని అరికట్టేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారు. ప్రత్యేక టీంలు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తున్నారు. డ్రగ్స్, మద్యం, గుట్కా వంటి అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మేడ్చల్ డీసీపీ పరిధిలోని పేట్‌బషీరాబాద్ పోలీసులు ఆరు నెలల వ్యవధిలో నాలుగు ప్రాంతాల్లో నాకాబందీ నిర్వహించి దొంగతనం చేసి తిరుగుతున్న వాహనాలతో పాటు, లైసెన్స్ లేకుండా నడుపుతున్న వారిని, మద్యం మత్తులో వెళ్తున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. క్రిమినల్ కేసులు నమోదై ఉన్న వారి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి వారిలో మార్పు వచ్చేలా కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నారు. ఆకస్మికంగా ఇప్పటికే దూలపల్లి చౌరస్తా, కొంపల్లి, కుత్బుల్లాపూర్ వెళ్లే రోడ్డులో ఏసీపీ బాల గంగిరెడ్డి, సీఐ విజయవర్ధన్, ఆరుగురు ఎస్‌ఐలు, 60 మంది సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. 11 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు, 4 ఫోర్ విలర్స్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 మంది, నిబంధనలకు విరుద్ధంగా నెంబర్‌ప్లేట్స్, ట్రాఫిక్ చలానాలు, లిక్కర్ సరఫరా వంటి మొత్తం 21 కేసులు నమోదు చేశారు. డ్రగ్స్ టెస్ట్ నిర్వహించారు. సుమారు 68 కాలనీలతో విస్తరించి ఉన్న పేట్‌బషీరాబాధ్ పీఎస్ పరిధిలో అత్యధికంగా విద్యాసంస్థలు, జాతీయ రహదారి, వీఐపీల రాకపోకలు, పదుల సంఖ్యలో ఫంక్షన్ హాల్ ఉండడంతో బిజీ షెడ్యూల్‌గా పోలీసుల విధులు ఉంటాయి.

ప్రతి నెల ఏదో ఒక చోట తనిఖీలు

పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధిలో అత్యధికంగా విద్యాసంస్థలు ఉండగా ఆ ప్రాంతంలో డ్రగ్స్, గుట్కా, మద్యం, గంజాయి, తదితర వాటిపై పోలీసులు దృష్టి సారించారు. విద్యార్థులకు సప్లయ్ చేసే వారిని గుర్తించి కేసు నమోదు చేసి జైలుకు పంపిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈ నేపథ్యంలో పలు ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో పెద్ద ఎత్తున గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మత్తు పదార్థాలను అరికట్టేందుకు ముఖ్యంగా విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని మైసమ్మగూడ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో మఫ్టీలో పోలీసులు సంచరిస్తూ డ్రగ్స్ అమ్మకాలను కట్టడి చేస్తున్నారు.

620 ఇళ్లల్లో తనిఖీలు

పేట్‌బషీరాబాద్ పీఎస్ పరిధి మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని దేవరయాంజాల్, మల్లన్న కాలనీ ఫేజ్2లో గత నెలలో డీసీపీ కోటిరెడ్డి నేతృత్వంలో తనిఖీలు నిర్వహించారు. అడిషనల్ డీసీపీ పురుషోత్తంరావు, ఏసీపీలు శంకర్‌రెడ్డి, బాల గంగిరెడ్డిలతో పాటు సీఐ విజయవర్ధన్, సిబ్బంది పెద్దఎత్తున కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 620 ఇళ్లల్లో విస్తృత తనిఖీలు చేపట్టి గంజాయి సేవించిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు అనుమానితులు, రౌడీషీటర్లను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అంతేకాకుండా బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు చేపడుతున్న వారిని గుర్తించి 74.2లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 332 వాహనాలను తనిఖీ చేసి 88 మంది ట్రాఫిక్ ఉల్లంఘనల విషయమై కేసులు నమోదు చేశారు. పెండింగ్ చలాన్లు వసూలు చేశారు. వాహనాలకు ఎలాంటి ఆధారాలు లేకుండా తమ వద్ద ఉంచుకున్న 35 వాహనాలను సీజ్ చేశారు. నిషేధిత గుట్కా ప్యాకెట్లను, అక్రమంగా నిల్వ ఉన్న 63 గ్యాస్ సిలిండర్లు, ఒక వెయింగ్ మిషన్, గ్యాస్ కట్టాలను గుర్తించడమే కాకుండా హుక్కా సెంటర్‌పై దాడి చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి సెంటర్‌ను సీజ్ చేశారు.

నిరంతర ఆకస్మిక తనిఖీలు



పేట్ బషీరాబాద్ పీఎస్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నాం. దొంగతనంగా వాహనాలు తీసుకువచ్చి నడుపుతున్న వాటిని గుర్తించి సీజ్ చేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఆయా ప్రాంతాల్లో నేరాల అదుపునకు సీసీ కెమెరాల ఏర్పాటు కోసం సంక్షేమ సంఘాలను భాగస్వాములు చేస్తున్నాం. నేరాలు నియంత్రించేందుకే కార్యాచరణ రూపొందించుకుని ప్రజల సహకారంతో కట్టడికి నిరంతరం కృషి చేస్తాం.

– విజయవర్ధన్, సీఐ

పోరాటాలతోనే సమస్యలు పరిష్కారం



సమావేశానికి హాజరైన కార్మికులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్

నిజాంపేట్ : పోరాటాలతో సమస్యలు పరిష్కారమవుతాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఎర్ర అశోక్ అన్నారు. శుక్రవారం సీఐటీయూ బాచుపల్లి మండలం నాలుగో మహాసభలు ప్రగతినగర్ సుందరయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో అనేక కార్మిక అనుకూల చట్టాలు సాధించటానికి సీఐటీయూ తనవంతు బాధ్యతగా నిరంతరాయంగా కృషి చేసిందన్నారు. రానున్న కాలంలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు నిర్వహిస్తామన్నారు. పోరాటాల్లో కార్మికులు పెద్ద ఎత్తున భాగస్వాములవ్వాలన్నారు. ఎన్నికైన నూతన కమిటీ కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్టు కార్మికుల పర్మినెంట్ కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతన కమిటీని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రాజశేఖర్ ప్రకటించారు. సమన్వయ కమిటీ కన్వీనర్‌గా ఆర్.సంతోష్, కమిటీ సభ్యులుగా పి.పెంటయ్య, ఎల్లమ్మ, శ్రీనివాస్, నాగలక్ష్మి, అంజి, కె.లక్ష్మి, పి.లక్ష్మి, మున్సిపల్ రంగం, భాగ్యలక్ష్మి, సోనీ అంగన్‌వాడీ రంగం, మీనా, వెంకటేశ్వరి ఆశా రంగం, ఎం.నరసింహ, బాబు నాయక్ ఆటో రంగం, రమేష్, విశ్వనాథ్ ఆటో ట్రాలీ, భాస్కర్, సతీష్ బీసీడబ్ల్యూ, పి.స్వామి స్ట్రీట్ వండర్స్ నుంచి ప్రకటించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బి.వెంకటరామయ్య, ఎం.చంద్రశేఖర్, ఎం.శంకర్, బాల వెంకటేశ్వరరావు, బాలస్వామి, చెన్నయ్య, సత్యనారాయణ, వెంకన్న, శ్రీను, మనీ, లక్ష్మి, పద్మ, వెంకటమ్మ, రత్నం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసిన హైడ్రా



సుభాష్‌నగర్: కోట్లు విలువచేసే పార్కు స్థలం కబ్జాపై స్థానికంగా ఉన్న కొంతమంది కాలనీవాసులు ఆరు సంవత్సరాలుగా చేస్తున్న పోరాటం ఎట్టకేలకు ఫలించింది. గాజులరామారం డివిజన్ మహాదేవపురంలో ప్రజా ప్రయోజన నిమ్మితం పార్క్ స్థలం కేటాయించారు. కాలనీలో భవనాలు రావడంతో కొంతమంది కళ్లు పార్కు స్థలంపై పడింది. దీంతో చాలా వరకు పార్కు స్థలాన్ని కబ్జా చేశారు. ఈ విషయమై స్థానికంగా ఉన్న కాలనీవాసులు 2018 నుంచి రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులతో పాటు హైకోర్టును ఆశ్రయించారు. ఎట్టకేలకు హైడ్రాధికారులు పార్కులను కాపాడడానికి ముందుకు వచ్చారు. శుక్రవారం హైడ్రా సీఐ నరేష్ నేతృత్వంలో పోలీసు భద్రత మధ్య 14 వేల గజాల విస్తీర్ణంలో ఉన్న పార్కుకు ఫెన్సింగ్ వేశారు. శనివారం నాలుగువేల గజాల విస్తీర్ణంలో ఉన్న మరో రెండు పార్కులకు ఫెన్సింగ్ వేయనున్నట్లు తెలిపారు.

బీసీలకు ద్రోహం చేసే పార్టీలను బొంద పెడతాం

సుభాష్‌నగర్: బీసీల రిజర్వేషన్లను అడ్డుకునే పార్టీలకు బొంద పెడతామని అఖిల భారత రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ జాతీయ అధ్యక్షుడు గూడ ఐలయ్యగౌడ్ అన్నారు. శుక్రవారం గాజులరామారం రోడామేస్త్రీనగర్‌లో భారత రాష్ట్రీయ దళిత సేన ఓబీసీ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు స్టే ఇవ్వడం తీరని అన్యాయమని, నోటికాడ ముద్దను గుంజుకోవడం ధర్మం కాదన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు తమ వైఖరి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో దళిత సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు అమర్ బాబు, జేమ్స్, ప్రధాన కార్యదర్శి బాలరాజు, మైనార్టీ అధ్యక్షులు సయ్యద్ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐలయ్యగౌడ్ తదితరులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ లైన్ల మరమతుల కారణంగా శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆయా సబ్ స్టేషన్ల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ హెచ్‌ఎంటీ సబ్‌స్టేషన్ శ్రీసాయి కాలనీ ఫీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు భగత్ సింగ్‌నగర్, గాంధీనగర్, చింతల్, శ్రీ సాయి కాలనీ, రంగానగర్, శివనగర్, నందనగర్, స్ఫూర్తి నగర్, వైఎస్ కాలనీ, పట్వారి ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలు, 33/11 కేవీ ప్రాగ టూల్స్ సబ్‌స్టేషన్ ఇండోర్ స్విమ్మింగ్ లీడర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఆస్ బెస్టాస్ కాలనీ, రసూల ఫార్మా ఫీడర్ మొత్తం ఏరియా, జీహెచ్‌ఎంసీ పార్క్, ఏబీ కాలనీ కమ్యూనిటీ హాల్, ఏపీ కాలనీ లాస్ట్ బస్టాప్, ఐడీఏ కూకట్‌పల్లి పరిధిలోని పలు ప్రధాన ఫీడర్లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారుల సహకరించాలని ఏడీఈ పేర్కొన్నారు.

12న నాగదేవత ఆలయ సప్తమ వార్షికోత్సవం

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ పరిధి పంచశీల కాలనీలోని నాగదేవత ఆలయ సప్తమ వార్షికోత్సవాన్ని ఈ నెల 12న నిర్వహించనున్నారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి ద్వాదశ క్షీరాభిషేకం, 8 గంటలకు అలంకరణ, పుష్పార్చన, 9 గంటలకు అమ్మవారి దివ్యదర్శనం, సర్ప సుబ్రహ్మణ్య హోమం, మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, అనంతరం భక్తులకు ప్రసాద వితరణ, సాయంత్రం 6 గంటలకు ధాతల సన్మానం, అమ్మవారి పల్లకీ సేవ తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ చైర్మన్ నందనం దివాకర్, అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని ఆలయ కమిటీ కోరింది.

ట్రాఫిక్ డైవర్షన్‌పై అధికారుల ప్రణాళికలు



రూట్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి తదితరులు

కుత్బుల్లాపూర్: సుభాష్‌నగర్ పైపులైన్ రోడ్డులో రూ.58 కోట్ల పనులతో చేపట్టనున్న స్టీల్ బ్రిడ్జి పనులు మరో వారం పది రోజుల్లో ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ డైవర్షన్ కోసం శుక్రవారం మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకటరెడ్డి, కూకట్‌పల్లి జోనల్ ఎస్‌ఈ చిన్నారెడ్డి, కుత్బుల్లాపూర్ సర్కిల్ ఈఈ లక్ష్మీగణేష్, డీఈ పాపమ్మ రూట్ మ్యాప్‌ను రూపొందించి దాని అమలు చేసే విషయంలో సాధ్యాసాధ్యాలపై చర్చించారు. ఎట్టకేలకు స్టీల్ సిటీ పనులు ప్రారంభమవుతుండటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పెంచిన బస్ చార్జీలను తగ్గించాలి



సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్

జగద్గిరిగుట్ట: పెంచిన బస్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద ప్రజలపై భారం పడకుండా నిర్ణయాలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి హరినాథ్ రావ్, ఏఐటీయూసీ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి అధ్యక్షులు ప్రవీణ్, నాయకులు నర్సింహారెడ్డి, వెంకటేష్, ఇమామ్, చంద్రయ్య, శ్రీనివాస్, రాజు, సామెల్, యాదగిరి, నర్సింహ, చంద్రకాంత్, గురప్ప, ఆశప్ప, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేకపోవడంతో పూడ్చివేత

దుండిగల్: అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాలను మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. దుండిగల్ మున్సిపాలిటీ పరిధి మల్లంపేటలోని లక్ష్మీ శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్‌లో ఇటీవల టీఎస్ బీ పాస్ అనుమతుల పేరుతో వినాయక రియల్టర్, బిల్డర్స్ పేరుతో నిర్మాణాలు చేపడుతున్నారు. స్థానికులు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు చేశారు. కాగా మున్సిపాలిటీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడంతో నిర్మాణ దశలో ఉన్న ఫుటింగ్‌లను మున్సిపల్ సిబ్బంది పూడ్చి వేశారు. మరో సారి నిర్మాణాలను చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఫుటింగ్‌లను పూడ్చి వేస్తున్న దృశ్యం

అటవీశాఖ చార్మినార్ సర్కిల్ క్రీడాపోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న అటవీ శాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ

సుభాష్‌నగర్: అటవీ శాఖ చార్మినార్ సర్కిల్ ప్రాంతీయ క్రీడా పోటీలు శుక్రవారం దూలపల్లిలోని తెలంగాణ అటవీ అకాడమీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అటవీశాఖ ప్రధాన ముఖ్య సంరక్షణ అధికారి డాక్టర్ సువర్ణ క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ అకాడమీ, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొననున్నారు. మొదటి రోజు కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, బాడ్మింటన్, రైఫిల్ షూటింగ్, రన్నింగ్ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం విధులతో బిజీగా ఉండే అధికారులు, సిబ్బందికి క్రీడలు ఉల్లాసంతో పాటు శారీరక ధారుఢ్యాన్ని పెంపొందిస్తాయన్నారు. కార్యక్రమంలో అధికారులు భగవత్, సరవణన్, ప్రియాంక వర్గీస్, రామలింగం, రమేష్, ప్రవీణ పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని తీసుకోవాలి

కుత్బుల్లాపూర్: అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న పోషక ఆహారాన్ని తీసుకుని పండంటి బిడ్డలను జన్మనివ్వాలని సీడీపీవో రేణుక అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో పోషకాహార మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలింతలు, గర్భిణులకు పోషకాహారం, మందులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులను చేర్పించాలని, అదే విధంగా కేంద్రాల్లో అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాగ్యమ్మ, అంగన్‌వాడీ టీచర్లు సురేఖ, రమణ, భవానీ, సునీత, శైలజ, శ్రీలక్ష్మి, సంధ్య, సంతోషి, రేణుక తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు అన్నప్రాసం నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా బాలకళ - 2025 ఉత్సవాలు

సుభాష్‌నగర్: విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మక శక్తిని వెలికి తీసేందుకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు దోహద పడతాయని అర్జున్ అవార్డు గ్రహీత అనూప్‌కుమార్ అన్నారు. గాజులరామారంలోని తత్వ గ్లోబెల్ స్కూల్‌లో శుక్రవారం బాలకళ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు 39 పాఠశాలల నుంచి 2,500 మంది హాజరయ్యారు. శుక్రవారం విద్యార్థులు గ్రూప్ సాంగ్ అండ్ డాన్స్, లిమేరిక్, డిక్లమేషన్, క్విజ్, టేబుల్ టెన్నిస్, చెస్, బాస్కెట్ బాల్, ఇంప్రాంప్ట్ స్పీకింగ్, మాత్ రిలే, ఫ్యాన్సీ డ్రెస్, ట్రెడిషన్ పెయింటింగ్, కార్డ్ మేకింగ్ డెకరేషన్, ఎలక్యూషన్, ఆరీగామి పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి పాఠశాల యాజమాన్యం బహుమతులు ప్రదానం చేసింది. ఈ సందర్భంగా అనూప్ కుమార్ మాట్లాడుతూ.. ఈ రోజు ఓటమి రేపటి గెలుపునకు దోహద పడుతుందన్నారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్లు విశ్వనాథ శివస్వామి, రంగధామ్, ఉషా తన్నీ, ప్రిన్సిపాల్ పావని, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అనూప్‌కుమార్, పాఠశాల యాజమాన్యం

చైన్ స్నాచర్ల ఆటకట్టు

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి అరెస్టు

కుత్బుల్లాపూర్: వేర్వేరు ప్రాంతాల్లో చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడిన ముగ్గుర్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ వివరాలను పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డి వెల్లడించారు.

- సంగారెడ్డి జిల్లా అన్నారం ప్రాంతానికి చెందిన మస్కూరి అరుణ్‌కుమార్ ఇంటి లోను ఈఎంఐ చెల్లించేందుకు డబ్బులు లేక చైన్ స్నాచర్‌గా మారాడు. ఈ నెల 3న జీడిమెట్ల బస్ డిపో వద్ద ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధ మహిళ మెడలో నుంచి పుస్తెల తాడు తెంచుకుని బైకుపై పరారయ్యాడు.
- చింతల్ ప్రాంతానికి చెందిన నీరుడి భూమయ్య చెడువ్యసనాలకు బానిసై..సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనం చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ నెల 7న గాగిల్లాపూర్‌లోని నారాయణాద్రి లే అవుట్ రోడ్డు వద్ద ఓ మహిళ మెడలో నుంచి గొలుసు లాక్కొని పరారయ్యాడు.
- కొంపల్లి ప్రాంతానికి చెందిన తుల్ల నిరంజన్‌రెడ్డి ఈ నెల 7న మచ్చబొల్లారంలోని సిద్ధి వినాయక నగర్‌లో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వృద్ధ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసును తెంపుకుని పారిపోయాడు.
- వారం రోజుల వ్యవధిలోనే మూడు చైన్ స్నాచింగ్ ఘటనలు చోటు చేసుకోవడంతో మేడ్చల్ జోన్ పోలీసులు అప్రమత్తమయ్యారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా పై ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వారి నుంచి సుమారు 7.2 తులాల బంగారం, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి, ఏసీపీ శంకర్‌రెడ్డి